అద్దె చెల్లించకపోవడంతో

సచివాలయానికి తాళాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపూట్టు పంచాయితీ సచివాలయానికి సొంత భవనం లేక ఓ అద్దె భవనంలో నిర్వహణ కొనసాగిస్తున్నారు. సచివాలయం ప్రారంభం నుంచి ఇప్పటికి సుమారు నాలుగేళ్ళు గడుస్తున్నా ప్రభుత్వం అద్దె చెల్లించక పోవడంతో ఆ ఇంటి యజమాని గురువారం సచివాలయానికి తాళాలు వేశారు. దీంతో సచివాలయ సిబ్బంది బయట వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

తాళాలు వేయడంతో వేచివున్న సిబ్బంది

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటాన్ని కొనసాగించాలని సిఐటియు ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షులు అజశర్మ పిలుపునిచ్చారు. మండలంలో గురువారం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడిల సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చెప్పిందని అన్నారు. గ్రాడ్యుటీ ఇవ్వాలని దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు నోటీసులు జారీ చేసి విధులకు హాజరు కాకపోతే ఉద్యోగాలు తీసి వేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఉన్న అంగన్వాడీలు తలుచకుంటే ప్రభుత్వాన్ని పడగొడతాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించకపోతే మరింత పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య, సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి మంజుల కమిడి, లక్ష్మీ, కొర్రా లక్ష్మి, సాగర, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు

కబడ్డి ఆడుతూ ఆందోళన

డుంబ్రిగుడ: అంగన్వాడి కార్మికులు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగింది. గురువారం మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడి కార్మికులు వినూత్న రీతిలో కబడ్డీ ఆడుతూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కే.కొండమ్మ, జి.పవిత్ర, కే.సత్యవతి, నిర్మల, అంగన్వాడీ కార్మికులు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీలు

పెదబయలులో....

పెదబయలు: అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద అంగన్వాడీల సమ్మె 22వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండమ్మ, దేవి, సుశీల, పద్మ, వరాలమ్మా తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: అంగన్వాడీ వర్కర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె గురువారానికి 24 రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో గురువారం అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి కే రామలక్ష్మి మాట్లాడుతూ 24 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ నాయకులు సింగారమ్మ, వెంకటలక్ష్మి, సత్యవేణి అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీ కార్మికులు సమస్యలు పరిష్కారం చేయాలని చేపట్టిన 24వ రోజు సమ్మె శిబిరాన్ని సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సీసం సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తు శుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి రాకపోతే రాష్ట్రంలో ఉన్న అంగన్వాడీ కార్మికులందరూ రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, అంగన్వాడీ కార్మికులు నూక రత్నం, వెంకటరమణ, జయ, కామేశ్వరి, కన్నకదుర్గ, ముత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్ష గురువారం కూడా కొనసాగింది. తమ డిమాండ్స్ పరిష్కరించాక పోతే సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాలు అచ్చిమ్మ, ముత్యాలమ్మ అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న అజశర్మ, చిత్రంలో గంగరాజు

చింతూరులో...

సిపిఎం కార్యాలయంలో మిడ్డేమీల్స్ కార్మికులను నిర్బంధించిన పోలీసులు

మిడ్డేమీల్స్ కార్మికులపై ముందస్తు నిర్బంధం

తీవ్రంగా ఖండించిన సిపిఎం, గిరిజన సంఘం

ప్రజాశక్తి- రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరిన మధ్యాహ్న భోజన కార్మికులను ఏజెన్సీలో పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా నిర్బంధం చేశారు. ఇందులో భాగంగా రంపచోడవరం చేరుకున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను రంపచోడవరం పోలీసులు ముందస్తుగా సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్బంధించారు. మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శాంతిరాజును అరెస్ట్ చేసి రంపచోడవరం పోలీస్ స్టేషన్‌కి తరలించారు. దీంతో శాంతరాజును విడుదల చేయాలని మిడ్ డే మీల్స్ వర్కర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముర్ల బాపనమ్మ, సీహెచ్.పద్మ, కుమారి, కె.అమ్మాజీ, పెద్ద సంఖ్యలో మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా?

తమ సమస్యలపై చలో విజయవాడ బయలుదేరిన మిడ్డే మీల్స్ వర్కర్లను ఎక్కడికక్కడ పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం, నిర్బంధించడాన్ని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇలా ముందస్తుగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. అక్రమ అరెస్టులు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. రోజురోజుకు రాష్ట్రంలో అనేక రంగాలకు చెందిన కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని సమ్మెలు, ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరు మారలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఐఐసి కార్డులు అందజేస్తున్న మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్ కుమార్ సింగ్

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని పివిటిజి తెగకు చెందిన కొండరెడ్డి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వ మోటా డిప్యూటీ కార్యదర్శి మనోజ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. గురువారం రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీ పరిధి కొయ్యలగూడెం గ్రామంలో జన్‌మన్ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సింగ్ మాట్లాడుతూ ఏజెన్సీలోని బాగా వెనుకబడిన కొండ రెడ్డి కులస్తులకు పక్క నివాస గృహాలు ఏర్పాటు, రోడ్లు, అంగన్వాడి భవనాలు, కరెంట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ మౌలిక సదుపాయల కల్పనపై ప్రస్తుతము సర్వే జరుగుతుందన్నారు. అనంతరం పివిటిజి గిరిజనులకు ఐఐసి కార్డులు అందజేశారు. ఈ సమావేశంలో ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్, ఏపీవో జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంపిటీసీ నర్రి పాపారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి గ్రామం చీడిపల్లివారి వీధిలో నాటుసారా విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన మచ్చ ప్రసాద్ బాబును అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 10 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సీఐ స్వామినాయుడు గురువారం తెలిపారు. స్థానిక ఎస్ఐ వెంకయ్య సిబ్బంది సహాయంతో దాడి చేసి సారా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని రంపచోడవరం జేఎఫ్సిఎం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. నాటుసారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తుపాన్ బాధిత రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -సీలేరు

తుఫాను సందర్భంగా వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని ధారకొండ ఎంపిటిసి అపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. జికె.వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తుఫాన్ వల్ల వరి, మినప, రాజ్మా తదితర పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాయన్నారు. దీనిపై పంట నష్టాన్ని అంచనా వేసి గిరి రైతులకు న్యాయం చేయాలని పలుమార్లు అధికారులు దృష్టికి వచ్చామన్నారు. సర్వేలు చేసిన అధికారులు ఇప్పటివరకు ఎటువంటి పరిహారం అందించలేదన్నారు. రైతులు బ్యాంకు రుణాలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాత రుణాలను రద్దు చేసి, కొత్త రుణాల్ని ఇవ్వాలని గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో గాలికొండ సర్పంచ్ సత్యవతి, ఉప సర్పంచ్ చంటి, కార్యదర్శి రాధా, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: కంటిపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు సిపిఎం జెడ్పిటిసి డిసరి గంగరాజుతో కలిసి ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలో తాగునీటి సమస్య నెలకు ఉందని గంగరాజు దష్టికి తీసుకు రావడంతో గురువారం ఆ గ్రామంలో సందర్శించిన ఆయన మహిళలతో తాగునీటి, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ, తమ గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు మరమ్మతుకు గురై మూడు నెలలు గడుస్తుందని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అనంతరం మరమ్మతుకు గురైన బోరు వద్ద మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి సమస్యపై అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటర్లు దూరంలో ఉన్న ఊట నీరు ఉన్న ప్రదేశానికి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం పై ఆయన మండిపడ్డారు. జిల్లా పరిషత్ నిధులతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలోనే నీటి సమస్య పరిష్కారం చేస్తానని మహిళలకు, గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, వంతల బుద్రయ్య, మహిళలు అంటిపర్తి బుల్లమ్మ, ఎ.చెల్లమ్మ గ్రామస్తులు అంటిపర్తి దేముడుబాబు,అప్పారావు, బి.సంస్మోన్ రాజు, జె.అప్పలనాయుడు, ఎ.పెంటన్న పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మిరియాల సాగుపై కళాజాతా

ప్రజాశక్తి-అరకులోయ: ఏజెన్సీలో మిరియాల సాగు పై కాళాజాత కార్యక్రమాల ద్వారా గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు అధికారి బొడ్డు కళ్యాణి చెప్పారు. గురువారం చినలబుడు పంచాయతీ తుడుము, దొరవలస గ్రామాల్లో మిరియాల సాగులో సస్యరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశుభ్రతపై రైతులకు కళాజాత ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఏజెన్సీలో మిరియాల సాగు మిరింత విస్తరణ,రాయితీపై యంత్రాలు, నాణ్యమైన ఉత్పతిపై గిరిజన రైతులను చైతన్యం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి కె.శిరీష, చినలబుడు సర్పంచ్ బురిడి ఉపేంద్ర, కె.దశరథ రామ్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా పోలవరం గ్రామసభలు

పత్తా లేని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు

మండల కేంద్రంలో బుధవారం నుండి ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల గ్రామసభలు గందరగోళంగా జరుగుతున్నాయి. గురువారం రెండో రోజు ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ నిర్వాసితుల గ్రామసభ గ్రామ పొలిమేరలో పోలవరం అధికారులు, ఎస్‌డిఎల్‌సి డిప్యూటీ తహశీల్దార్లు నిర్వహించారు. ఇంటి నిర్మాణ అంచనా, భూమి కొలతలు, నిర్ధిష్టమైన ఇంటి విలువ పరిహారం తదితర అంశాలపై స్పష్టత లేకుండానే... పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల భూమిని, ఇంటిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు సిఫామ్, చెక్ ఫార్ములనుపై సంతకాలు చేయించి తీసుకోవడంపై నిర్వాసితులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వకుండానే పరిహారం అందినట్లు ముందుగానే పత్రాలపై సంతకాలు చేయించుకొని నిర్వాసితుల నుండి పత్రాలు తీసుకోవడంపై ఐటీడీఏ పీఓను కలిసి విషయం తెలియజేశారు. దానికి స్పందించిన పిఒ అటువంటి సంతకాలు పెట్టిన పత్రాలను వెనక్కి ఇచ్చివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో, నిర్వాసితులు తిరిగి వాటిని తీసుకున్నారు.

గ్రామసభలో పాల్గొన్న ఎస్‌టి, బిసి కాలనీల నిర్వాసితులు

గ్రామసభలకు రాని ప్రజాప్రతినిధులు

పోలవరం నిర్వాసితుల జీవితాలకు సంబంధించిన ముఖ్యమైన గ్రామసభలు జరుగుతుంటే, ప్రజల తరుపున మాట్లాడటానికి ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరూ సభకు రాకపోవడంపై సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఎండి హబీబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం పరిహారం అంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు పరిహాసంగా ఉందన్నారు. ఒకపక్క కాపర్ డ్యామ్ ప్రభావం వల్ల ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో వరద ముంపుతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని, వారికి పరిహారం, పునరావాసం త్వరగా కల్పిస్తే ఈ ప్రాంతాన్ని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నిర్వాసితులు సుముఖత వ్యక్తం చేసినా ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరంచడం దారుణమన్నారు. కేవలం 650 నివాసాలకు మాత్రమే మండల కేంద్రంలో సర్వేలు చేశారన్నారు. తూతూ మంత్రంగా మసిపూసి మారేడు కాయ చేసే విధంగా పేరుకు మాత్రమే గ్రామ సభలు పెట్టి నిర్వాసితులను మభ్యపెట్టడం సరైన పద్ధతి కాదని ఖండించారు. గ్రామసభలపై పోలవరం అధికారులకే అవగాహన కరువైందని, సరైన సమాధానం అధికారుల వద్ద లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయి సమాచారంతో పునరావాస అవగాహన కలిగి ముందుగా గ్రామ సభలో ప్రజలకు అర్ధమయ్యేలా పరిహార ప్రక్రియ కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు చిన్నారెడ్డి. గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్. కాంగ్రెస్ నాయకులు అహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో డిఎవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మోతుగూడెం : ఢిల్లీలోని ఘజియాబాద్ స్టేడియంలో ఆల్ ఇండియా డిఎవి పాఠశాలలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో చింతూరు మండలం మోతుగూడెం ఎపి జెన్‌కో డిఎవి పాఠశాల బాలికలు అండర్ -14 విభాగం ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. మోతుగూడెం డివిఎ పాఠశాల విద్యార్థులు గత నెలలో పాల్వంచలో క్లస్టర్ స్థాయిలో కబడ్డీ పోటీలో పాల్గొని ప్రథమ స్థాయిలో నిలిచారు. తరువాత జోనల్ స్థాయిలో హైదరాబాదులో నిర్వహించిన పోటీలో ద్వితీయ స్థానంలో నిలవడగా, వారిలో ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ బాలికలు ఈ నెల 4న జరిగిన జాతీయ స్థాయి పోట్లోనూ ప్రతిభ చూపి, సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు డిఎవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రఘురాం, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ ఎల్‌ఎంసి చైర్మన్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, డిఈటి వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, మోతుగూడెం పోలీస్ ఎస్ఐ బి.గోపాలరావు, మోతుగూడెం సర్పంచ్ అకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, సీలేరు ఏపీ జెన్కో స్పోర్ట్స్ సెక్రెటరీ సతీష్ రాఘవన్, ఏపీ జెన్కో ఉద్యోగస్తులు, గ్రామస్తులు ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ద్వితీయ స్థానం సాధించిన డిఎవి విద్యార్థులు

యువతకు టిక్కెట్ కేటాయించాలి

వినతిపత్రం అందజేస్తున్న సుబ్బారావు

ప్రజాశక్తి-పాడేరు:రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాడేరు ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి టిడిపి సీటును యువతకు కేటాయించాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కొట్టగుల్లి సుబ్బారావు కోరారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఈ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడును పలువురు నేతలతో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా వైయస్సార్సిపిని ఓడించాలంటే యువ నాయకత్వాన్ని బలపర్చి టిడిపి టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు. దీనిపై అచ్చం నాయుడు సానుకూలంగా స్పందించారని అధినేత దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

ఇవిఎంలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఇవిఎంలు, ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ సిహెచ్ నాగమ్మ అవగాహన కల్పించారు. ఓటర్లకు గురువారం అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా విలువైందని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో పాటు ఇతర శాఖల సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకుని వచ్చే ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.హరికృష్ణ, వీఆర్వో ఝాన్సీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సిపిఐ పాడేరు మండల సహాయ కార్యదర్శి అమర్, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఎఐఎస్ఎఫ్ పాడేరు మండల అధ్యక్షులు సంజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉమెన్స్ హాస్టల్లో గురువారం విద్యార్థినిలతో మాట్లాడి విద్యార్థుల మరణాలకు కారణాలను, మెనూ అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల మరణాలు అరికట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తూనే వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించినప్పటికీ వారి తీరు మార లేదని ఆరోపించారు. వీటిపై ప్రశ్నిస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టడం తప్ప సమస్యల పరిష్కారంపై దృష్టి సారించ లేదని విమర్శించారు. మెనూ సక్రమంగా అమలు చేయక పోవడంతో పౌష్టికాహారం అందక రక్తహీనతతో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు.

నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 5న శుక్రవారం జరగనున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం కొన్ని పరిపాలనా పరమైన కారణాలతో రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

వైసిపిలో అసమ్మతి సెగ

మాధవికి టిక్కెట్ ఇవ్వొద్దని నిరసన.. పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరిక

డుంబ్రిగుడ, పెదబయలులో నిరసన చేపడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానికేతరులైన ఎంపీ మాధవిని సమన్వయకర్తగా నియమిస్తే తమ పదవులకు రాజీనామా చేస్తామని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బి సింహాచల, సిహెచ్ కృష్ణారావు, మండల అధ్యక్షుడు మల్లేష్ హెచ్చరించారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో చాలా మంది టికెట్కు ప్రయత్నాలు సాగిస్తున్నారని, వారికి కేటాయించకుండా, వేరే నియోజకవర్గం వారికి ఇవ్వడం సరికాదన్నారు.

ఈ విధమైన చర్యలతో భవిష్యత్తులో పార్టీ నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని పునరాలోచించి స్థానిక నియోజక వర్గంలోని వారికి సమన్వయకర్తగా నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, ఎంపిటిసిలు, సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు:ఎంపి మాధవికి టికెట్ కేటాయించడంపై మండల కేంద్రంలో వైసిపి నేతలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ మండల అధ్యక్షులు వంతాల ఆనందరావు, నాయకులు గంపరాయి సూరయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు కొంట్టా. సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, మాజీ సర్పంచ్ పాంగి. సింహాచలం, మండల కన్వీనర్ కొర్రా. కనకరాజు పాల్గొన్నారు

యంత్రాల్లో పగుళ్లు పెను ప్రమాదానికి సంకేతం

ప్రొఫెసర్ కృష్ణమూర్తిని అభినందిస్తున్న గీతం ప్రతినిధి

ప్రజాశక్తి-మధురవాడ : యంత్రాలలో కనిపించే చిన్నపాటి పగుళ్లు కూడా పెను ప్రమాదానికి సంకేతమని, వాటిని ప్రారంభంలోనే గుర్తించి సరిచేయాలని ఐఐటి గౌహతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కెఎస్ఆర్.కృష్ణమూర్తి అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, యంత్రాలు, వాటి విడిభాగాలు తీవ్ర ఒత్తిళ్లకు గురైనప్పుడు సన్నటి చీలికలు ఏర్పడి, అవి క్రమేణా పెద్దవై ప్రమాదాలకు కారణమౌతాయన్నారు. అణు విద్యుత్తు కేంద్రాలు, రైలు పట్టాలు, భారీ నౌకలు, వంతెనలు, గ్యాస్ సరఫరా పైపులైన్లు, విమానాలలో ఏర్పడే పగుళ్లు భారీప్రమాదాలకు దారితీసిన సందర్భాలున్నాయన్నారు. గుజరాత్లో హెలీపాడ్పై దిగుతూ రెండు ముక్కలైన హెలికాప్టర్, సముద్రంలో మునిగిపోయిన నౌక వంటి ప్రమాదాలు ఈ కోవకే చెందుతాయన్నారు.. యంత్రాలలో ఒత్తిడికి గురయ్యే ప్రదేశాల్లో పగుళ్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెమ్24 ప్రచారానికి విద్యార్థుల ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీలలో నిర్వహించనున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్)-2024 ప్రచారంలో భాగంగా గురువారం వివిధ ప్రాంతాలలో గీతం విద్యార్థులు ఫ్లాష్మాబ్ నిర్వహించారు. హుషారైన నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు జెమ్2024 యువజ నోత్సవంలో పాల్గొనాలని కోరారు. వాణిజ్య అంశాలపై పోటీలతో పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉంటాయని జెమ్2024 సిఇఒ ఐ.సింధువర్మ తెలిపారు.

ఫ్లాష్మాబ్ నిర్వహిస్తున్న గీతం విద్యార్థులు

నేటి నుంచి సౌత్జోన్ ఇంటర్ వర్సిటీ యూత్ ఫెస్టివల్

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ(ఏఐయూ) పర్యవేక్షణలో 37వ సౌత్జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) శుక్రవారం ప్రారంభం కానుంది. యువ భేరి పేరిట ఈనెల 5 నుంచి 9వరకు ఎయులో నిర్వహించనున్న యూత్ ఫెస్టివల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 20కిపైగా వర్సిటీలకు చెందిన 700 మంది విద్యార్థులు భాగమవుతున్నారు. సంగీతం, నృత్యం, లిటరరీ ఈవెంట్స్, ఫైన్ఆర్ట్స్ ,థియేటర్ ఇలా ఆరు విభాగాలలో 28 అంశాలలో పోటీలను నిర్వహిస్తారు. విద్యార్థులకు, వారితో వచ్చే మేనేజర్స్, ఇతర సభ్యులకు వర్సిటీలో వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. సాంస్కృతిక పోటీలకు బీచ్రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్, సాగరిక ఎసి ఆడిటోరియం, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ మూడు వేదికల్లో జరుగుతాయి. విజేతలను ఎంపిక చేయడానికి ఏఐయూ న్యాయనిర్ణేతల కమిటీని నిర్ణయించనుంది 9న ముగింపు రోజున విజేతలకు బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతివిద్యార్థికి సర్టిఫికెట్, మెడల్ అందజేస్తారు.

నేరాలు ఘోరాలు

నాటుసారాతో ముగ్గురు అరెస్ట్

పట్టుబడిన నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నాటు సారా తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు స్థానిక ఎస్సై ఎస్.సంతోష్ కుమార్ గురువారం స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటనలో తెలిపారు. గుంట గన్నేల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన వంతల భగత్రం, కిల్లో భగవాన్, కిల్లో దోయ్ మొత్తిలను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. నాటుసారా, గంజాయి తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వ్యాను

బోల్తా పడిన వ్యాను

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి, డముకు టైడా ఘాట్ రోడ్లో కూరగాయల వ్యాను అదుపుతప్పి మలుపులో చెట్టుకు ఢీ కొంది. బుధవారం కించమండ సంతలో కూరకాయలు కొనుగోలు చేసి మైదాన ప్రాంతం విశాఖ రైతు మార్కెట్ల్ తరలిస్తూ గురువారం డముకు, టైడా నాలుగో నెంబర్ మలుపు తిరుగుతూ వ్యాను బ్రేకులు ఫెయిలై చెట్టును ఢీకొట్టి ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్లకు తీవ్ర గాయాలు అయ్యాయి

క్రికెట్ టోర్నీ విజేతకు బహుమతి ప్రదానం

ట్రోఫీతో విజేతలు.

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:మండలంలోని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యాన ఏఎస్ఆర్ స్కూల్, ఇంటర్మీడియట్ కళాశాల వ్యవస్థాపకుడైన అల్లూరి మూర్తి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ అరకువేలి అల్లూరి సీతారామరాజు గ్రౌండ్లో నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో 8 పాఠశాలల జట్టు పాల్గొన్నాయి. ఇందులో అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ ఎపిఆర్ పిటీజి బాయ్స్ స్కూల్ జట్టు ఫైనల్కు చేరుకుంది.గురువారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా ఏపీఆర్ పిటిజి బాయ్స్ విజేతగా నిలిచి 5 వేలు బహుమతి, ట్రోపి గెలుపొందారు .రెండోవ బహుమతిగా ఏఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ 3 వేలు బహుమతి, ట్రోపి గెలుపొందారు. గెలుపొందిన జట్టులకు ఏఎస్ఆర్ స్కూల్ యజమాన్యాలు అభినందనలు తెలిపారు.

మోదకొండమ్మ సన్నిధిలో కేంద్ర డిప్యూటీ సెక్రటరీ

జ్ఞాపికను ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీ పర్యటనలో భాగంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ గురువారం మోద కొండమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 5న అరకు వ్యాలీ మండలం కొత్త బల్లు గూడ గ్రామంలో సందర్శిస్తారు. గ్రామస్తులతో ముచ్చటిస్తారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాలా

సాగర పరిక్రమతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాగర పరిక్రమ కార్యక్రమంతో మత్స్యకారులకు తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు రానున్నాయని, మరింత ఆర్థిక భరోసా లభించనుందని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా పేర్కొన్నారు. ఫిషింగ్ హర్బర్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన 10వ సాగర పరిక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. తన పర్యటనలో భాగంగా తీరప్రాంతాల్లోని బాగా పనిచేసే ఫార్మసికల్, ఫిష్ ఫీడ్ అసోసియేషన్, ఎక్స్పోర్ట్ అసోసియేషన్, ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, నేచురల్ అసోసియేషన్ల వద్దకు స్వయంగా వెళ్లి వారి కష్టాలు తెలుసుకున్నానని, వాటికి పరిష్కార మార్గాలు కనుక్కొని వెంటనే అమలు చేస్తానని అన్నారు. మహిళా మత్స్యకారులకు చేయూతనిస్తామన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు గతంలో వ్యవసాయం వరకే ఉండేదని, ఇప్పుడు మత్స్యకారులకు కూడా పెద్ద ఎత్తున కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్నామని గుర్తు చేశారు. తొలుత ఆయన ఫిషింగ్ హార్బర్లోని 11వ జెట్టీని పరిశీలించారు. 39 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ద్వారా రూ.23.50 లక్షల రుణాల నమూనా చెక్కును అందజేశారు. అలాగే ఒక చేపల రవాణా వాహనం, ఐస్ బాక్సులు కలిగిన 23 ద్విచక్ర వాహనాలు, 27 ఫిష్ ఆంధ్రా యూనిట్లు, 4 లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్ యూనిట్లు, 10 ఓపెన్ సీ కేజెస్ యూనిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర పశు సంవర్థక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్, రాష్ట్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కేంద్ర మత్స్య శాఖ జాయింట్ సెక్రటరీ నీతూ ప్రసాద్, శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు, రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, స్థానిక కార్పొరేటర్ చెన్న జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం

ప్రకాశక్తి-రాజవొమ్మంగి : వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసి చూపుతున్నారన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన 75 మంది పెన్షన్ దారులకు పత్రాలు అందజేశారు. 200 మంది లబ్దిదారులకు ఇండియన్ ఫ్రీ గ్యాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్ర రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, ఎంపీడీవో విజయ రంగారావు, సిఐ స్వామి నాయుడు, ఎస్ఐ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మిద్దె తోటల నగరంగా విశాఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చి దిద్దుతామని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం ఎపిడి లక్ష్మి అన్నారు. ఆదర్శనగర్లో జివిఎంసి అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం నిర్వహించిన మన కూరగాయల తోట కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ తెచ్చిన కూరగాయల మొక్కలు, విత్తనాలను పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. రసాయన ఎరువులు, రసాయన క్రిమి సంహారకాలు, రసాయన కలుపుతీత మందులు లేకుండా ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అమర్ స్వయంకృతాపరాధం

ప్రజల్లో కోల్పోయిన పట్టు
స్థానిక నాయకత్వంతో పెరిగిన దూరం
చుట్టుముట్టిన భూ ఆక్రమణ ఆరోపణలు
నియోజకవర్గంలో కానరాని అభివృద్ధి
లోపాలను గుర్తించి సరిచేసుకోలేక అవస్థలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఇద్దరు మంత్రుల్లో అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్థానంలో సమన్వయకర్తగా మలసాల భరత్కుమార్ను నియమించి, రాష్ట్ర పంచాయతీరాజ్శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును వి.మాడుగుల నుంచి యథాతథంగా కొనసాగించడం వెనుక కారణాలేంటి ? ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నమ్మిన వ్యక్తుల్లో ఒకరైన అమర్కు ఈ అవమానం ఎందుకు జరిగింది ? ముత్యాలనాయుడుకు ఆ గౌరవం ఎందుకు దక్కింది ? అమర్కు నియోజకవర్గం వదిలి వెళ్లాల్సిన పరిస్థితులెందుకు వచ్చాయి ? అమర్ అవధులు దాటి వ్యవహరించడం వల్ల నియోజకవర్గ ప్రజల్లో పట్టు కోల్పోయారా ? బుధవారం జరిగిన భరత్కుమార్ పరిచయ సభలో ఉద్వేగానికిలోనై ఏడ్వాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది ? ఇటువంటి ప్రశ్నలే జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా వినిపిస్తున్నాయి. దీనికి సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే సమాధానమిస్తూ.. 'లోపాలను సరిచేసుకోక... రాజకీయంగా వచ్చిన మంచి అవకాశాన్ని అమర్ జారవిడుచుకున్నారు' అని అంటున్నారు.

పార్టీ పదవులు అనుభవిస్తూ అవినీతిపరులన్న ముద్రలున్నవారిని, రియల్ ఎస్టేట్ వ్యాపారులను ప్రోత్సహించి, ప్రజలతో సంబంధాలున్న ప్రజాప్రతినిధులను, నాయకులను దూరం చేసుకున్నారన్న విమర్శలు అమర్పై ఎంతోకాలంగా వున్నాయి. అనకాపల్లి నియోజకవర్గంతో సంబంధంలేని మునగపాక మండలంలోని ఒక వ్యక్తికి ఇచ్చిన ప్రాధాన్యత నియోజకవర్గంలోని సర్పంచ్, ఎంపిటిసి, ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ఇవ్వకపోవడాన్ని పలువురు జీర్ణించుకోలేకపోయారు. అమర్ తన సామాజిక తరగతిని అంటిపెట్టుకొని, మిగిలిన వారిని దూరం చేసుకున్నారు. అందరినీ కలుపుకొని వెళ్లలేకపోవడంతో మంత్రి వ్యవహారశైలి పట్ల సొంత పార్టీలోనే అసంతృప్తి క్రమంగా పెరిగింది. రెండోసారి మంత్రివర్గ విస్తరణలో వచ్చిన మంత్రి పదవిని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించుకోలేకపోయారు. నేలవిడిచి సాముచేసినట్లు క్షేత్రస్థాయిలో తన విజయానికి పనిచేసిన నాయకులను వదిలిపెట్టడంతో టిక్కెట్ ఇచ్చినా అమర్ గెలవరన్న వ్యాఖ్యానాలు కొన్ని నెలలుగా విన్పించడం ఆరంభించాయి. భూ ఆక్రమణలు, అనుచరుల భూ దందాలపై అనేక ఆరోపణలను అమర్ ఎదుర్కొన్నారు.

తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చే కంటే అధికార దర్పం ప్రదర్శించారు. తన తప్పిదాలను గుర్తించి, సరిదిద్దుకొనే ప్రయత్నం కంటే విమర్శలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వీటికి తోడు నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడం, ఉన్న కొద్ది సమయంలోనైనా నాయకులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను విని పరిష్కరించే చొరవ తీసుకోకపోవడం, విశాఖ నగరంలోని తన ఇంటికి వెళ్లిన గ్రామ స్థాయి నాయకత్వానికి కనీస విలువ ఇవ్వకపోవడం వంటి బలహీనతలు ఆయనకు రెండోసారి అనకాపల్లి నుంచి పోటీ చేసేందుకు అర్హతకోల్పోయేలా చేశాయి.

ఉద్యోగాలు ఊడగొడతాం..!

వారం చూస్తాం.. టెర్మినేషన్ చేస్తాం..
సమగ్రశిక్ష సిబ్బందిని లొంగదీసుకునే యత్నాల్లో ప్రభుత్వం
ఉద్యమిస్తున్నందుకు షోకాజ్లు
అయినప్పటికీ జడవని ఉద్యోగులు
నేడు చలో విజయవాడ - ఎస్పిడి కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

చిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కొద్ది రోజులుగా ఉద్యమిస్తుంటే పలు రకాలుగా బెదిరిస్తూ లొంగదీసుకునే యత్నాలకు పాల్పడుతోంది. అయిప్పటికీ వెరవక శుక్రవారం విజయవాడ పడమటలోగల రాష్ట్ర విద్యాశాఖ ఎస్పిడి కార్యాలయానికి వెళ్లి తమ ఆందోళనను తెలియజేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు సిద్ధమయ్యారు. వారిని ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నాల్లో పోలీసులను ప్రభుత్వం రంగంలోకి దింపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, మండల, పట్టణ కేంద్రాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు వచ్చాయి. రాష్ట్ర స్థాయి అధికారులను ఆయా జిల్లాలకు పర్యటనలకు పంపుతూ విద్యాశాఖ, కెజిబివి, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమీక్షలు జరుపుతూ 'ఉద్యోగాలు ఊడగొడతాం' అంటూ హెచ్చరికలు పంపడం పట్ల ప్రభుత్వ తీరుపై సామాన్య ప్రజానీకం నుంచీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర శిక్షలో పనిచేసే సిఆర్పిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు.. ఇలా అన్ని తరగతుల సిబ్బందికీ పేరు పేరునా గురువారం షోకాజ్ నోటీసులను తయారు చేసి ప్రభుత్వం పంపింది.

'నోటీసులు ఇచ్చిన నుంచీ లెక్కపెట్టుకోండి.. ఏడు రోజుల్లో టెర్మినేషన్ ఆర్డర్లు వస్తాయి. కొత్తవారిని ఈ స్థానాల్లో రాష్ట్ర వ్యాప్తంగా రిక్రూట్మెంట్ చేసుకుంటాం' అంటూ ఎస్పిడి వాయిస్ రికార్డును రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖ కార్యాలయాలకు పంపడం చిరుద్యోగులను మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. విశాఖ నగరంలో గురువారం ఆందోళనలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులంతా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహంతో రగిలిపోతూ ఎలాగైనా విజయవాడ వెళ్లి తాడోపేడో తేల్చుకుంటామంటూ పెద్దపెట్టున నినదించారు. పోరాటాన్ని ఆపేది లేదంటూ ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్రలో కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ ముఖ్యంగా కెజిబివి, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బందిని రెగ్యులర్ చేసేందుకు ఇచ్చిన హామీని ఎలా మరచిపోయారంటూ గుర్తుచేశారు.

మార్కెట్లో కొత్త ఉద్యోగాలు :
పొందిన వారు అదృష్టవంతులంట ?

కెజిబివి, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారిలో 90 శాతం మంది సమ్మెలో ఉన్నారని, ఈ పోస్టులను గతంలో పొందని వారు అంటే వీరి తర్వాత మెరిట్ లిస్టులో ఉన్నవారిని ఎంపిక చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ షోకాజ్ నోటీసులో ఎస్పిడి పేర్కొన్నారు. దీనిపై ఉద్యోగులు ఏ మాత్రమూ వెనక్కి తగ్గకుండా మేం విజయవాడలో తేల్చుకుంటాం అంటూ గట్టిగా బదులిస్తున్నారు.

సమావేశంలో పాల్గొన్న సబ్ కలెక్టర్, పిఒ

పోలింగ్ బూత్ల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సెక్టార్ల అధికారులందరూ పోలింగ్ బూతులకు సంబంధించిన రూట్లు పరిశీలించుకోవాలని, మౌలిక సదుపాయలపై దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో జరిగిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత సంబంధిత శాఖలకు సంబంధించిన విధులతోపాటు ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలు హ్యాండ్ బుక్లో పొందుపరచడం జరిగిందన్నారు. సెక్టర్ల అధికారులందరూ ముందుగా రూట్ మ్యాప్లు తెలుసుకొని ఆ రూట్లలో పర్యటించి తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ ఎన్ వి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ టి.లక్ష్మణ్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని వెలగపల్లి నుంచి కన్నారం రోడ్డు పనులు మొదలుపెట్టాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన గురువారం స్థానిక జూనియర్ కాలేజీ నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జుత్తు కుమార్ మాట్లాడుతూ వెలగపల్లి నుండి కన్నారం వరకు మధ్యలో ఐదు గ్రామాలు ఉన్నాయని, ఈ గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం లేక కనీసం ఆసుపత్రికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ రోడ్డుకి ఎన్ఆర్ఈజీఎస్ నుండి నిధులు మంజూరై నాలుగేళ్లు అవుతుందని, నేటి వరకు పనులు మొదలు పెట్టకుండా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన వెలగపల్లి కన్నారం రోడ్డు పనులు, వెలగపల్లి గుంపనపల్లి మధ్యలో గల వాగుపై బ్రిడ్జి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం ఇంజనీర్ అధికారులు ధర్నా వద్దకు విచ్చేసి వెంటనే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బాల్ దొర, కామేశ్వరరావు, సత్తిబాబు, బాబి, నరసన్న, రామన్న తదితరులు పాల్గొన్నారు.

రెవియా బ్రాండ్లో గేర్, ట్రాన్స్మిషన్ ఆయిల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీదారు, సరఫరాదారుగా పేరుపొందిన బ్రేక్స్ ఇండియా సరికొత్త బ్రాండ్ 'రెవియా' కింద గేర్, ట్రాన్స్మిషన్ ఆయిల్ విడుదల చేసినట్లు బ్రేక్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుజిత్ నాయక్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 3 బిలియన్ల డాలర్ల టిఎస్ఎఫ్ సమూహంలో బ్రేక్స్ ఇండియా భాగమన్నారు. భద్రత, నాణ్యత కోసం ప్రపంచ ఆటోమోటివ్ ల్యాండ్స్కేప్లో ఇప్పుడు లూబ్రికెంట్స్ స్పేస్లో పెరుగుతున్న డిమాండ్ను తీర్చడానికి దాని విస్తారమైన పంపిణీ నెట్వర్క్ను పెట్టుబడిగా పెడుతోందన్నారు.

షర్మిల కాంగ్రెస్లో చేరికపై హర్షం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్టిపి అధినేత్రి వైఎస్.షర్మిల చేరడం హర్షనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జివిఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ తాడి మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వలస వెళ్లిన నాయకులంతా తిరిగి పార్టీలో చేరాలని కోరారు.